క్లుప్తంగా

గ్రామాల్లో పోలీసు కవాతు..



పోలిపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

భోగాపురం: ఎస్పీ దీపిక ఆదేశాల మేరకు రాబోయే జనరల్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటునట్లు సీఐ రవికుమార్ వెల్లడించారు. ఈ మేరకు మండలంలోని సమస్యాత్మక ప్రాంతలైన పోలిపల్లి, లింగాలవలస గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి ఆదివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోలన్నారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు సూర్యకుమారి, తాతారావు, కేంద్ర బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మి జయంత్యుత్సవం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో ఉన్న భారతీయ తత్త్వ దర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో మహాలక్ష్మి జయంత్యుత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఆలయ అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు, రమేష్ ఆచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం 5 గంటలకు ఐశ్వర్యలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న అష్టావధానం



అష్టావధానం చేస్తున్న తాతా సందీప్ శర్మ

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో ఉత్తరాది మఠంలో అష్టావధానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ శతవధాన శరచ్చంద్ర తాతా సందీప్ శర్మ (రాజమండ్రి) అవధానం చేశారు. ప్రచ్ఛకుల ప్రశ్నలకు అవధాని చమత్కారభరితంగా సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ భైరవభట్ల విజయాదిత్య, దశగ్రంథాల వెంకట సుబ్రహ్మణ్యం, సరిపల్లి సోమేశ్వరరావు, డాక్టర్ శిరీషా రఘురామన్, డాక్టర్ భాష్యం హరిచందన్, ఎం.దుర్గాప్రసాద్, భోగరాజు ఖాదరవలీ బాబూజీ, భోగరాజు సూర్యలక్ష్మి, వారణాశి నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ



విజ్జి స్టేడియంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేషన్ ఉద్యోగులు, తదితరులు

విజయనగరం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ చిన్ని తిరుమలరావు పిలుపునిచ్చారు. ఓటుహక్కు విశిష్టతను వివరిస్తూ నగర శివారులో గల విజ్జి స్టేడియంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ఓటు ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. ఓటుకు మించిన ఆయుధం వేరొకటి లేదని తెలిపారు. ప్రజలందరూ తప్పనిసరిగా పోలింగ్ రోజున తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, పారిశుద్ధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, సలీంరాజు, రామకృష్ణ, అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పండుటాకులకు అండగా..

- ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంపు
- ప్రతి నెలా ఒకటో తేదీన నగదు అందుకుంటున్న లబ్ధిదారులు
- ఆత్మగౌరవంతో బతుకుతున్నామంటున్న వృద్ధులు



విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ సూరీడు (ఫైల్)

నెల్లిమర్ల రూరల్: జీవిత చరమాంకంలో అయిన వారికి కూడా భారం అవుతున్న అవ్వా, తాతలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పెద్దకొడుకులా అండగా నిలిచాడు. శక్తి సన్నగిల్లి కూలి పనులకు పోలేక, ఉపాధి కరువై... అయిన వాళ్లకి భారమై.. ఈసడింపులు, చీత్కారాలతో ఇబ్బందులు పడుతూ.. కనీస గౌరవం లేక అల్లాడుతున్న పండుటాకులు, వితంతువులు, దివ్యాంగులకు తానున్నానే భరోసా కల్పించారు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి. తన సుదీర్ఘ పాదయాత్రలో వాడవాడలా తిరిగి వద్ధులు, దివ్యాంగుల కష్టాలను పెద్ద మనసుతో అర్థం చేసుకున్న జగన్ మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఏడాది రూ. 250 చొప్పున పెంచుతూ పెన్షన్‌ను మూడు వేల రూపాయలు ఇస్తానని చెప్పి.. అనుకున్న ప్రకారం నేడు మూడు వేల రూపాయల పెన్షన్ అందిస్తూ అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ప్రతి నెలా ఒకటో తేదీన కోడి కూయక ముందే వలంటీర్లు ఇంటి తలుపు తట్టి పెన్షన్ అందజేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆత్మగౌరవంతో బతుకుతున్నారని చెప్పక తప్పదు. వైఎస్సార్ పింఛన్ కానుక కింద నెల్లిమర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 39,922 మంది లబ్ధిదారులకు గాను వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రూ.524 కోట్లు అందజేయడం విశేషం.

జీవితానికి భరోసా..



జగన్‌బాబు మా వృద్ధుల జీవితాలకు భరోసా కల్పించారు. గతంలో కడుపు నిండా తిండి తినే అవకాశం కూడా లేదు. జగన్‌బాబు వచ్చాక ఆత్మగౌరవంతో బతుకున్నాను. జగన్‌బాబు తప్ప నా వెనుక నా అనేవాళ్లు ఎవరూ లేరు. ఆ బాబు ఇచ్చిన మూడు వేల రూపాయలతో నాలుగు మెతుకులు తింటున్నాను.

– గురాన శూరమ్మ, దేవుని నెలివాడ గ్రామం.

మా అవసరాలు తెలుసుకున్నారు..



వృద్ధుల అవసరాలను జగన్‌బాబు తెలుసుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ. 3 వేల పింఛన్ ఇవ్వడంతో నిజంగానే కష్టాలు తీరాయి. మందుల ఖర్చులకు కూడా అయినోళ్లకు అడగకుండా పెన్షన్ డబ్బులతో కాలం వెళ్లదీస్తున్నాం. జగన్‌బాబు మరోసారి సీఎం కావాలి.

– దంతినాద సత్యవతి, రామతీర్థం పంచాయతీ

ఆనందంగా ఉంది..



చివరి కాలంలో బతుక్కి భరోసా దక్కింది. జగన్ బాబు పుణ్యమా అని నెలకు రూ.3000 పింఛన్ పొందడంతో ఆనందంగా ఉంది. చివరి దశలో కూటికి ఇబ్బంది లేకుండా గడపుతున్నాం. వచ్చిన పింఛన్ సొమ్ముతో నా లాంటి లక్షల మంది క్షేమంగా బతుకుతున్నారు.

– మీసాల బంగారమ్మ, సతివాడ గ్రామం

అవసరాలు తీరుతున్నాయి..



నెలకు రూ.3వేలు పింఛన్ అందడంతో అవసరాలు తీరుతున్నాయి. వృద్ధాప్యంలో ఉన్న తమకి అవసరాలు తీర్చుకునేందుకు డబ్బులు వెతుక్కోవాల్సిన పరిస్థితి గతంలో ఉండేది. ప్రస్తుతం ఆ బాధ లేదు. వచ్చిన పెన్షన్ డబ్బులతో దర్జాగా బతుకుతున్నాం.

– దవల రాములమ్మ, మొయిద గ్రామం

ఎంతో మేలు చేశారు..



పెంచిన పింఛన్ సొమ్ముతో కుటుంబ సభ్యులపై ఆధారపడడం తగ్గింది. రోజుకు వంద చొప్పున వస్తుందంటే ఇంతకన్నా ఇంకేం కావాలి. పింఛన్ సొమ్ము పెంచి ఇవ్వడం వల్ల మా పిల్లలు కూడా మమ్మల్ని బాగా చూసుకుంటున్నారు. పింఛన్ పెంచుతామని జగన్ బాబు చెప్పి ఆ హామీని నెరవేర్చడం ఎంతో సంతోషంగా ఉంది.

– దేబార్కి రమణమ్మ, పెదతరిమి గ్రామం

పేదల బతుకులకు ఆసరా...



రూ.3వేల పింఛన్‌తో పేదలకు ఆసరా కలగడంతో పాటు బతుకుకు భరోసా లభించింది. గతంలో మహానుబావుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే నాకు పింఛన్ మంజూరైంది. ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అన్ని విధాల సుభిక్షంగా జీవిస్తున్నాం.

– పంచాది జగ్గునాయుడు, వల్లూరు గ్రామం

జగన్‌తోనే పేదల సంక్షేమం..



ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

- ఐదేళ్లలో అన్ని రంగాల్లో విజయనగరం అభివృద్ధి
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలోని 6,7 డివిజన్‌లలో ఇంటింట ఎన్నికల ప్రచారం

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో రాజకీయాలకతీతంగా.. అర్హతే ప్రామాణికంగా.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 6, 7 డివిజన్ ప్రాంతాలలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దాసన్నపేట కాపువీధి వద్దనున్న వాటర్ ట్యాంక్ నుంచి ప్రచారం ప్రారంభించగా.. కోలగట్ల, తదితరులకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులిచ్చి పూలదండలతో సత్కరించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, మరోసారి తనకు ఎమ్మెల్యేగా, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌కు అవకాశమిస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. గడిచిన 4 ఏళ్ల 10 నెలల కాలంలో జరిగిన సంక్షేమం, అభివృద్ద్ చూసి ఓటు వేయాలని అభ్యర్థించారు. తనకిచ్చిన అవకాశం మేరకు విజయనగరం జిల్లా కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయగలిగానని.. కరోనా వంటి విపత్కర సమయంలో కూడా ప్రజలకు అండగా నిలవగలిగామని చెప్పారు. ఎన్నికలు వచ్చినప్పుడే కొంతమంది నాయకులు ప్రజల వద్దకు వస్తుంటారని.. అటువంటి వారికి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తనకు పదవులు ఉన్నా.. లేకున్నా నిత్యం ప్రజల మధ్యనే ఉంటానని చెప్పారు. ఏడో డివిజన్ కార్పొరేటర్ పొంతపల్లి మాలతి, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ బోడసింగి ఈశ్వరరావు మాట్లాడుతూ... అభివృద్ధి ప్రదాత అయిన కోలగట్ల వీరభద్రస్వామి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తమ ప్రాంతంలో ఉన్న నీటి సమస్యను పరిష్కరించిన కోలగట్లకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. దాసన్నపేటలో వాటర్ ట్యాంక్ నిర్మించి ప్రజల దాహార్తిని తీర్చారని కొనియాడారు. నగరాన్ని సుందరంగా అభివృద్ధి చేసిన ఘనత కోలగట్లకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, రెడ్డి గురుమూర్తి, 6వ డివిజన్ కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి, మాజీ కౌన్సిలర్ కోరాడ సూర్య ప్రభావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పొంతపల్లి గోపి, మజ్జి శ్రీను, ఆకుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



నెల్లిమర్ల: జరజాపుపేటలో అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

నెల్లిమర్ల: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని సీఐ వెంకటేశ్వర్లు కోరారు. జరజాపుపేట, కొండపేట, గరికపేట గ్రామాల్లో శనివారం రాత్రి ఆయన పర్యటించి, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియామవళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. బైండోవర్ కేసులు ఉన్నవారు గొడవలకు దిగరాదని సూచించారు. విద్యార్థులు రాజకీయ తగాదాల్లో తలదూర్చవద్దన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై డి. రామగణేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి..

పూసపాటిరేగ : ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనసరిగా పాటించాలని భోగాపురం రూరల్ సీఐ బి. వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఎరుకొండలో ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు అత్యంత విలువైనదన్నారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పూసపాటిరేగ ఎస్సై ఎ. సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం క్రైమ్: లంకాపట్నంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న టూటౌన్ సీఐ కోరాడ రామారావు

సహకరించండి

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఓటర్లందరూ సహకరించాలని టూటౌన్ సీఐ కోరాడ రామారావు అన్నారు. పూల్‌భాగ్, గాజులరేగ, లంకాపట్నం, తదితర ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రజలను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



విజయనగరం: క్రైస్తవుల ర్యాలీ

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సింగపూర్ సిటీ ప్రాంత చర్చి పాస్టర్ ఎల్.మధుసూదన్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ప్రార్థనా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాసన్నపేట నుంచి సింగపూర్ సిటీ వరకు కీర్తనలు ఆలపిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పాస్టర్ అనిత, కృపవతి, సంగీత మాధురి, మనోజ్, దినేష్, సురేష్, అనిల్, శ్రీను, బాలు, సంఘ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం టౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్ రవికుమార్, తదితరులు

ఏసు ప్రేమాలయం ఆధ్వర్యంలో..

విజయనగరం టౌన్: ఏసు ప్రేమాలయం ఆధ్వర్యంలో మట్టల ఆదివారం కార్యక్రమంలో భాగంగా చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మట్టలతో కోట వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ అలజంగి రామారావు, ఝాన్సీ సుజన్, బుంగ భానుమూర్తి, విక్టర్ బాబు, జాన్, కోరాడ నాగేశ్వరరావు, సూర్యనారాయణ, దేవరాజు, అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

పూసపాటిరేగ : మండలంలోని గైతులుచోడవరం సమీపంలో ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 90 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని భోగాపురం సీఐ బి. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గైతులు చోడవరం సమీపంలో ఆదివారం వాహన తనిఖీలు చేపడుతుండగా ఎస్. గంగులు అనే వ్యక్తి మద్యంతో పట్టుబడ్డాడన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. తనిఖీల్లో ఎస్సై ఎ. సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధి గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు ఈనెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే నెల 21న మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఐదో తరగతి ఉత్తీర్ణత పొందిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

- రెడ్‌క్రాస్ కార్యదర్శి సత్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యం

విజయనగరం ఫోర్ట్: క్షయ వ్యాధి పట్ల జాగ్రత్తలు వహించాలని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి పి. సత్యం అన్నారు. ఆదివారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. క్షయ అంటువ్యాధని, ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందుతుందన్నారు. క్షయ రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వచ్చే ఉమ్మి తుంపర్ల ద్వారా క్షయ వ్యాప్తి చెందుతుందని చెప్పారు. ఈ వ్యాధి పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాల మీదకు వస్తుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్న వారు దగ్గరలో ఉన్న పీహెచ్‌సీలో కఫం పరీక్ష చేయించుకో వాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణ, గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, నడిపేన శ్రీనివాసరావు

- ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి
- వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పలనాయుడు, శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కార్యకర్తలను సమాయత్తం చేయడంలో భాగంగా మండలంలోని రాకోడులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అప్పలనాయుడు, నడిపేన శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ ఐదేళ్లలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించాలని సూచించారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రజలకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలను జన్మభూమి కమిటీల రూపంలో టీడీపీ నేతల జేబుల్లోకి వెళ్లాయని ఆరోపించారు. చంద్రబాబునాయుడు బూటకపు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వందకు వంద శాతం అమలు చేశారని కొనియాడారు. రెండేళ్ల కరోనా కష్టకాలాన్ని అధిగమించి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తూనే, గ్రామాల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు వెచ్చించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలు, రైతులు, పేదలు, విద్యార్థులు ఇలా అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగిందని చెప్పారు. అలాగే గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు ఇళ్ల వద్దే సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా వైద్య, విద్యా రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన ఘనత జగనన్నదేనని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలకు చెప్పుకోవడానికి ఏమీలేకే మోసపూరిత మాటలు, దగా హామీలతో ప్రజల వద్దకు వస్తున్నారని, అటువంటి వారికి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించి, జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పాటిపిరెడ్డి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి జాతర



పోలిపల్లి పైడితల్లి



భోగాపురం కనకదుర్గమ్మ



ఎల్లమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

భోగాపురం: మండల కేంద్రంలో కొలువైన ఎల్లమ్మ తల్లి జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు వేకువజామునే లేచి జోగి దండి ఎల్లమ్మకు సమర్పించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు కొమ్మూరు బుల్లయ్య, ఆళ్ల విశ్వేశ్వరరావు, తిరుమరెడ్డి చిన్నారావు, తదితరులు ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి పైడితల్లి, కనకదుర్గ అమ్మవార్ల జాతర ..

భోగాపురం: పోలిపల్లి పైడితల్లి, భోగాపురం కనకదుర్గ అమ్మవార్ల జాతరలు సోమవారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పూర్తి చేశారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు వీలుగా ఆలయాల వద్ద క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల భక్తులు ఇప్పటికే ఆలయాల వద్దకు చేరుకున్నారు. అమ్మవార్లను దర్శించుకుని, తలనీలాలు చెల్లించి బోనాలు సమర్పించుకుంటారు. జాతర ప్రాంతాలు దుకాణాలు, సర్కస్‌లు, బొమ్మల దుకాణాలతో కళకళలాడుతున్నాయి. అలాగే ప్రధాన రహదారులు, ఆలయ ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలకరించారు. ఎస్పీ దీపిక అదేశాల మేరకు సీఐ రవికుమార్, ఎస్సైలు సూర్యకుమారి, తాతారావు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కర్రోతు పైడిరాజు, సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, పతివాడ రామకృష్ణ, కనకదుర్గ ఆలయ ధర్మకర్త కందుల రఘుబాబు, కమిటీ సభ్యులు కొమ్మూరు సుభోషణరావు, కొమ్మూరు బుల్లయ్య, ఆళ్ల విశ్వేశ్వరరావు, ఉదయబాబు, తదితరులు ఏర్పాట్లు చేశారు.